


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 07-09-2024 సంపుటి : 06 సంచిక : 349 పేజీలు : 8 వెల : రూ

# చంద్రబాబు ఏరియల్ సర్వే



విజయవాడ, సెప్టెంబర్ 6 విజయవాడలోని వరద ముంపు ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు శుక్రవారం ఏరియల్ సర్వే ) చేశారు. వరదలకు మూల కారణమైన బుడమేరు డ్రైన్, కొల్లేరు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. వరద ప్రవాహం, ముంపు, గండ్లు పడిన ప్రాంతాలను సర్వే చేశారు. ప్రకాశం బ్యారేజీ దిగువన కృష్ణా నదీ ప్రవాహాన్ని పరిశీలించారు. అంతకుముందు నగరంలో కొనసాగుతోన్న వరద సహాయక చర్యలపై మంత్రులు, అధికారులతో సీఎం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొన్ని ప్రాంతాల్లో వరద తగ్గగా పారిశుద్ధ్య పనులు కొనసాగుతున్నాయి. వీటిపై పూర్తి వివరాలను అధికారులు సీఎంకు వివరించారు. ఫైరింజన్లతో రోడ్లు, కాలనీలు, ఇళ్లు, షాపుల్లో బురదను తొలగించాలని.. చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. వరదలకు ఇళ్లల్లో చెడిపోయిన ఎలక్ట్రిక్ వస్తువులను రిపేర్ చేయించేందుకు నిపుణులను పిలిపించాలని సూచించారు. అటు, బుడమేరుకు పడిన గండ్ల పూడ్చివేత పనులను అధికారులు సీఎంకు తెలిపారు.తుది దశకు వరదల నివేదికకృష్ణా, ఎన్టీఆర్ జిల్లాను వరదలు ముంచెత్తాయి. ముఖ్యంగా విజయవాడ నగరం ముంపునకు గురయ్యాయి. వేలాది కుటుంబాలు కట్టుబట్టలతో రోడ్డున పడ్డాయి. వరద తగ్గిన ప్రాంతాల్లో ఎటు చూసినా... బురదే కనిపిస్తోంది. దీంతో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు జరుగుతున్నాయి. నిన్న కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కూడా ఏపీలో వరద మిగిల్చిన నష్టాన్ని పరిశీలించారు. చంద్రబాబుతోనే సమావేశమమై చర్చించారు. గురువారం (సెప్టెంబర్ 5వ తేదీ) రాత్రి ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు చంద్రబాబు. ఇవాళ (సెప్టెంబర్ 6వ తేదీ) సాయంత్రంలోగా వరద నష్టంపై తొలి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామన్నారు చంద్రబాబు. ఈ నివేదిక ఆధారంగా మళ్లీ సవివరంగా మరో నివేదికను పంపుతామని చెప్పారు. దీనివల్ల వరద నష్టాన్ని అధ్యయనం చేసేందుకు, కేంద్ర బృందం వచ్చేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు.ముంపు ప్రాంతాల్లో బురద కడిగేందుకు పారిశుద్ధ్య పనులను శరవేగంగా జరుగుతున్నాయన్నారు చంద్రబాబు. 206 నీళ్ల ట్యాంకర్లు 513 ట్రిప్పులు వేశాయన్నారు. గురువారం రోజు ఫైర్ ఇంజిన్లు 5వేల ఇళ్లను శుభ్రం చేశాయని చెప్పారు. ఇవాళ మరింత విస్తృతంగా క్లీనింగ్ పనులు జరుగుతాయని చెప్పారు. కారు క్లీనింగ్ చేసే చిన్నచిన్న మెషీన్లను తీసుకొచ్చి.. అవసరమైతే 300, 400 సేకరించి అన్ని ఇళ్లను శుభ్రంచేసే బాధ్యత తీసుకుంటామన్నారు. ఇక.. నీటి కనెక్షన్లను చాలా వరకు పునరుద్ధరించామన్నారు చంద్రబాబు. ఈ నీటిని రెండు రోజుల పాటు ఇంటిని శుభ్రం చేయడానికి, స్నానం చేయడానికి ఉపయోగించొచ్చు గానీ.... వంటకు, తాగడానికి ఉపయోగించొద్దని స్పష్టమైన ఆదేశాలిచ్చామన్నారు.గురువారం రోజు శానిటేషన్, ముంపు, మెడికల్ క్యాంప్‌లపై ప్రజాభిప్రాయ సేకరణ తీసుకున్నామన్నారు చంద్రబాబు. 72 శాతం మంది ప్రజలు.. తమ ప్రాంతాల్లో శానిటేషన్ ప్రారంభమైందని చెప్పారన్నారు. మెడికల్ క్యాంప్స్ పెట్టారా అంటే.. 72 శాతం మంది... పెట్టారని తెలిపారన్నారు. ఒక వైపు శానిటేషన్‌ను పూర్తిచేస్తూనే... ఎక్కడికక్కడ బ్లీచింగ్ చేయమన్నామన్నారు. వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఇంటికి మెడికల్ కిట్ ఇచ్చి.. వారం పది రోజుల్లో చేయాల్సినవి.. చేయకూడనివి ఏంటి అనేదానిపై పాంప్లేట్లు పంచుతున్నామన్నారు. అవసరమైతే వేరే రాష్ట్రాల నుంచి ఫైరింజన్లు తెప్పించమని కూడా ఆదేశించామన్నారు చంద్రబాబు. ఇంకా కొన్ని అపార్ట్‌మెంట్లు, కొన్ని ప్రాంతాల్లో నీరు నిలిచి ఉందని.. ఆ నీటి తోడేందుకు కూడా చర్యలు చేపట్టామన్నారు. ముంపు ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన విద్యుత్, టెలికం సేవలను పునరుద్ధరిస్తున్నామన్నారు సీఎం చంద్రబాబు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో వరద నీరు ఉందని.. నీరు తగ్గగానే విద్యుత్ కనెక్షన్లు ఇస్తామన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఈ నెల విద్యుత్ బిల్లులను కూడా వాయిదా వేస్తున్నామన్నారు. ఇక... గ్యాస్ స్టవ్ రిపేర్, మోటారు వెహికల్ రిపేర్లు, ఎలక్ట్రీషియన్లు అవసరమని... ఆ సేవలన్నీ అందేలా చేయడంపై దృష్టిసారిస్తున్నామన్నారు. ఈ సేవలకు సంబంధించి ప్రస్తుతమున్న వ్యవస్థీకృత సంస్థలతో సంప్రదింపులు జరిపి.. అవసరమైతే ఇన్సెంటివ్‌లు ఇచ్చి సేవలందించేలా చేస్తామన్నారు చంద్రబాబు. రాయితీలతో రేట్లను నిర్దేశించి సేవలందించేలా చూస్తామన్నారు. ఎక్కడికక్కడ కార్పెంటర్, ప్లంబర్, మెకానిక్, పెయింటర్.. ఇలా అన్ని వర్కులకు సంబంధించి సేవలందించేలా చూస్తామన్నారు.

## బుడమేరు మూడో గండిని పూడ్చేందుకు రంగంలోకి దిగిన ఆర్మీ సిబ్బంది



అమరావతి : విజయవాడను ముంచేత్తిన బుడమేరు గండి పూడ్చివేతకు ఆర్మీ సిబ్బంది రంగంలోకి దిగింది. విపత్కర సమయంలో సైన్యం ఉపయోగించే గేబియాన్ బుట్టల ద్వారా గండ్లు పూడ్చేందుకు కావాల్సిన పరికారాలను యుద్ధప్రాతిపదికన సిద్ధం చేసుకున్నారు. ఆరో మద్రాస్ రెజిమెంట్ నుంచి వచ్చిన 120 మంది ఆర్మీ సిబ్బంది సహాయ చర్యల్లో పాల్గొంటున్నారు.బుడమేరు వాగుకు ఒకవైపు మూడు గండ్లు, రెండో వైపు ఏడు గండ్లు పడ్డాయి. ఒకవైపు పడ్డ మూడు గండ్లలో రెండు గండ్లను అధికారులు పూడ్చివేయగా మూడో గండి సుమారు 80-100 మీటర్ల వరకు 24 గంటల్లో పూడ్చేందుకు ఆర్మీ ప్రణాళిను సిద్ధం చేసుకుంది. విజయవాడ నగరం వైపు పడ్డ మూడు గండ్ల నగరాన్ని అతలకుతలం చేశాయి. సుమార 32 కాలనీలు మునిగిపోయి సుమార లక్ష మంది నిరాశ్రయులయ్యారు.ముందు జాగ్రత్తగా బాధితులను ఇతర ప్రాంతాలకు తరలించారు. అనేక మంది తమతమ బంధువుల ఇళ్లల్లో తలదాచుకుంటున్నారు. ఇనుప చువ్వతో బుట్టలా చేసి దానిని పెద్దరాళ్లు, ఇసుక బస్తాలతో నింపడం ద్వారా గండి పూడ్చాలని నిర్ణయించినట్లు సైన్యం వెల్లడించింది. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మూడురోజులుగా బుడమేరుపైనే ఉండి పనులను పర్యవేక్షిస్తున్నారు.

## వచ్చే 24 గంటల్లో కోస్తాంధ్రలో విస్తారంగా వర్షాలు..



గురువారం పశ్చిమ మధ్య, ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతంపై ఉన్న అల్పపీడన ప్రాంతం శుక్రవారం, సెప్టెంబర్ 6, 2024 ఉదయం 08:30 గంటలకు మధ్య బంగాళాఖాతం, ఆనుకుని ఉన్న ఉత్తర బంగాళాఖాతం మీద ఉంది.దాని అనుబంధ ఉపరితల ఆవర్తనము సగటు సముద్ర మట్టానికి 7.6 కి.మీ ఎత్తు వరకు విస్తరించి, ఎత్తుతో నైరుతి దిశగా వంగి ఉన్నది. ఇది దాదాపు ఉత్తరం వైపు నెమ్మదిగా కదులుతూ సెప్టెంబరు 9 నాటికి వాయువ్య బంగాళాఖాతం, గంగా పరీవాహక పశ్చిమ బెంగాల్, ఉత్తర ఒడిశా, బంగ్లాదేశ్ తీరాల పరిసర ప్రాంతాలలో వాయుగుండముగా మారే అవకాశం ఉంది. ఆ తర్వాత, తదుపరి 3-4 రోజులలో ఇది పశ్చిమ వాయువ్య దిశగా గంగా పరీవాహక పశ్చిమ బెంగాల్, దాన్ని ఆనుకుని ఉన్న ఉత్తర ఒడిశా, జార్ఖండ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్ మీదుగా కదులుతుంది.సగటు సముద్ర మట్టం వద్ద ఋతుపవన ద్రోణి బికనీర్, నార్నాల్, సిధి, సంబల్‌పూర్ , మధ్య బంగాళాఖాతం, దాని పక్కనే ఉన్న ఉత్తర బంగాళాఖాతం మీదుగా ఏర్పడి ఉన్న అల్పపీడన ప్రాంత కేంద్రం గుండా కొనసాగుతున్నది.

## రైతులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దు .. ప్రభుత్వాలు అండగా ఉంటాయి : కేంద్ర మంత్రి

అమరావతి : కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రెండో రోజు శుక్రవారం కృష్ణా జిల్లా కేసరపల్లిలో పర్యటించారు. బుడమేరు గండ్ల వల్ల పంట నష్టపోయిన బాధితులను పరామర్శించారు.



ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి నిర్వహించి నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రైతులకు అండగా ఉంటాం. ప్రధాని మోదీఆదేశాలతో వరద విపత్తును పరిశీలించి నష్టాన్ని అంచనా వేసేందుకు, రైతులతో మాట్లాడటానికే ఇక్కడికి వచ్చాను. రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తిగా, రైతు పక్షపాతిగా అన్నదాతల సమస్యల పట్ల పూర్తి అవగాహన ఉందన్నారు. 8,9 రోజులుగా రైతుల పంట పొలాల్లో నీళ్లు నిలిచి ఉన్నాయి. వరి సహా పలు రకాల పంటలు పూర్తిగా నీట మునిగి రైతులు నష్టపోయారని తెలిపారు.సీఎం చంద్రబాబు, ప్రధాని మోదీ ఈ విపత్తును సీరియస్‌గా తీసుకున్నారని, ఇద్దరూ కూడా రైతులకు అండగా నిలబడతారని, రైతులు ఆందోళన చెందవద్దని, ఆత్మస్థైర్యం కోల్పోవద్దని సూచించారు. కేంద్ర మంత్రి వెంట మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ పురందేశ్వరి, అధికారులు ఉన్నారు. అనంతరం వారు ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు.

## ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసిన ఆవుల విజయ భాస్కర్ రెడ్డి దంపతులు

**మట్టితో చేసిన వినాయక విగ్రహాలను ప్రతిష్టించి పూజించండి..**



ఆళ్ళగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 06 విభారె న్యూస్ :- పర్యావరణానికి దోహదపడే మట్టితో చేసిన గణపతి విగ్రహాలు పర్యావరణానికి దోహదపడతాయని ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి అధ్యక్షులు భాస్కర్ రెడ్డి లతారెడ్డి దంపతులు అన్నారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఆవుల పుల్లారెడ్డి సేవాసమితి భవనంలో శుక్రవారం వారు మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలగకూడదని ఆలోచనతో మట్టితో చేసిన మట్టి విగ్రహాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. పిఓపి తో తయారుచేసిన విగ్రహాలలో వాడే రసాయన రసాయనాలు రంగులు పర్యావరణానికి హాని



కలిగిస్తాయని వారు పేర్కొన్నారు. అలాగే అవి నీటిలో కరగడనికి కూడా సమయం పడుతుందన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి ద్వారా వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టితో చేసిన గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్నామన్నారు. పర్యావరణ సంరక్షణపై ప్రజల్లో కూడా అవగాహన పెరగాలన్నారు. ఏది ఏమైనా మనం చేసే పండుగలు పర్యావరణానికి ఉపయోగపడాలి తప్ప హాని కలిగించకూడదన్నారు. స్వచ్ఛంద సంస్థలు పర్యావరణ ప్రేమికులు ప్రేరణతో ప్రజల్లో కొంత మార్పు ప్రారంభమైందని ఫలితంగా మట్టి విగ్రహాలకు ఆదరణ పెరుగుతుందన్నారు. ఈ ఆదరణ మరింత పెరిగి మట్టితో చేసిన విగ్రహాలే అందరూ పూజించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానంద స్వామి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి టీజీ భరత్, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు : రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రివర్యులు టి.జి. భరత్, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. .గణనాథుని కృపతో జిల్లా ప్రజలంతా సంతోషంగా ఉండాలని, వినాయకుడి ఆశీస్సులతో ప్రజలకు మంచి జరగాలని, చేపట్టే ప్రతి పనిలో విజయం చేకూరాలని మంత్రి, కలెక్టర్ ఆకాంక్షించారు. .పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, మట్టి వినాయకుని విగ్రహాలతో పూజలు జరుపుకుని, సంతోషంతో పండుగ చేసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి, కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు..



# సంపాదకీయం

శనివారం 07-09-2024

## విపత్తులు నేర్పిన పాఠాలు ఏంటీ

ప్రభుత్వాలు వస్తుంటాయి పోతుంటాయి. కానీ, దశాబ్ధాలుగా ఆయా శాఖల్లో ఉండే అధికారులు పరిస్థితులను అంచనా వేయలేరా..? సంబంధిత శాఖల ఉన్నతాధికారులకో.. లేదా మంత్రులకో ముందుగానే ప్రమాద హెచ్చరికలపై సమాచారం ఇవ్వాలి కదా..? సరే, వరద విషయంలో వైఫల్యం స్పష్టంగానే ఉందీ.. పోనీ, సహాయక చర్యల్లో అయినా బాధితులకు అందుబాటులో ఉన్నారా అంటే.. ఇక్కడ కూడా అధికారుల అలసత్వం కనిపిస్తుందని బాధితులు వాపోతున్నారు. ఇంతకీ, ఈ విపత్తు నుండి నేర్చుకోవాల్సిన పాఠాలేంటి..?వరదల విలయానికి రెండు తెలుగు రాష్ట్రాలూ అల్లాడాయి. పీకల్లోతు నీళ్లు.. ఎటూ వెళ్లలేని పరిస్థితి. కుండపోత వర్షంలో కుటుంబాలను కాపాడుకోలేని దుస్థితి. నదీ ప్రవాహంలో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారా అన్నట్లు.. ఎటు చూసిన నీటి ప్రవాహం. ఇది ఊహించని పరిణామమే కావచ్చు.. కానీ అంచనా వేయలేని పరిస్థితి కాదన్నది అందరు చెబుతున్న మాట. రెండు రాష్ట్రాల్లోనూ ఆయా శాఖలు, విభాగాలు ఉన్నాయి. వాతావరణ శాఖ నిరంతరం పరిస్థితిని అంచనా వేస్తూ నివేదికలు తయారు చేస్తుంది. వర్షం ఎప్పుడొస్తుందీ..? ఎంత మేరకు వర్షం పడుతుంది..? ఎక్కడెక్కడ జాగ్రత్తలు పాటించాలి..? అనే అంశాలు క్లియర్‌గా ఉంటాయి. అలాగే, నదుల ప్రవాహం, నీటి పరిమాణం, దారి మళ్లింపులు, చెరువులు పరిస్థితులు వంటి విషయాలను పర్యవేక్షించడానికి పలు శాఖలు వాటి అధికారులు ఉంటారు. ముఖ్యంగా వర్షాకాలం వస్తుందంటే సంబంధిత శాఖలు మరింత అప్రమత్తంగా ఉండాలి. మరి ఏం జరిగింది.. ? వీళ్లంతా ఏమై పోయారు..? వాతావరణ శాఖ నివేదికలు తప్పయ్యాయా..? నిపుణులు అంచనా వేయలేదా..? అధికారులు నిర్లక్ష్యం వహించారా..? తప్పు ఎక్కడ జరిగింది..?భారీ వర్షాలు వరదల కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 4.5 లక్షల మంది ప్రభావితమయ్యారు. 166 సహాయ శిబిరాలు ఏర్పాటు చేసి.. 30 వేల మందికి పైగా బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అయితే, ఇలాంటి పరిస్థితుల మధ్య కూడా బాధితులకు సహాయం సరిగ్గా అందట్లేదనే ఆరోపణలు వస్తున్నాయి. వర్షం తగ్గినప్పటికీ వరద కష్టాలు మాత్రం ప్రజల్ని ఇంకా వదిలిపెట్టలేదు. రెండు రోజులు నరకయాతన చూసిన ప్రజలు ఇప్పటికీ తాగడానికి నీళ్లు, తినడానికి ఆహారం కోసం తీవ్రమైన కష్టాలు పడుతున్నారు. కనీసం, సురక్షిత ప్రాంతాలకు వెళ్లడానికి కూడా సహాయక చర్యలు సరిగ్గా అందట్లేదని వాపోతున్నారు.ఈ పరిస్థితిపై ఏపీ సీఎం చంద్రబాబు అధికారుల్ని హెచ్చరించారు. గత ప్రభుత్వంలో మాదిరిగా ఉంటామంటే కుదరదని వార్నింగ్ ఇచ్చారు. మొద్దు నిద్ర వీడాలన్నారు. అధికారుల పనితీరు ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా ఉండాలన్నారు. పరిస్థితిని అంచనా వేయలేకపోయారు సరే.. కనీసం, సహాయక చర్యల్లో అయినా నిబద్ధతను చూపించమని అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. బుడమేరు ముంపు ప్రాంతాల్లో డ్యూటీలో ఉన్న అధికారుల తీరును ఎప్పటికప్పుడు మంత్రులు పర్యవేక్షించాలని కోరారు. కాగా.. కొంత మంది అధికారులు కావాలనే సహాయక చర్యలకు ఆటంకం కల్పిస్తున్నారని సీఎంకు ఫిర్యాదులు వెళ్లే పరిస్థితికి అధికారులు చేరుకున్నారు. అయితే, ఎవరు డ్యూటీలో ఉండగా సహాయక చర్యల్లో జాప్యం జరుగుతుందో వారిపై సీఎం చంద్రబాబు నివేదిక కోరినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో జక్కంపూడిలో ఒక అధికారిని సస్పెండ్ చేయగా.. మంత్రుల్ని సైతం ఉపేక్షించేది లేదంటూ సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారుప్రతి అధికారీ సహాయక చర్యల్లో పాల్గొనాలని చంద్రబాబు ఆదేశించారు. మానవతా దృక్పథంతో అధికారులు స్పందించాలి అన్నారు. మన కుటుంబసభ్యులే వరదల్లో చిక్కుకుంటే ఎలా రియాక్ట్ అవుతావో అలాగే స్పందించాలన్నారు. చనిపోయిన వారి బాడీలను తీయకపోతే.. రేపు మనం చనిపోయినప్పుడు ఎవరు తీస్తారంటూ ప్రశ్నించారు. ఇది తీవ్రమైన సమస్య అని, ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో అధికారులే కాదు, మానవత్వంతో ప్రతి ఒక్కరూ స్పందించాలని అన్నారు. ప్రజల పరిస్థితులను అర్థం చేసుకుంటూ అధికారులు నడుచుకోవాలని సూచించారు.అయితే, ఈ కథ ఇంతటితో ముగిసిందని అనుకోలేని పరిస్థితి. ఎందుకంటే, తెలంగాణ రాష్ట్రానికి మరో భారీ ప్రమాదం పొంచి ఉందని తెలుస్తోంది. సెప్టెంబర్ 5న బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. దీని ప్రభావం రెండు తెలుగు రాష్ట్రాల పైన ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. ఉత్తర అండమాన్ సమీపంలో ఏర్పడనున్న ఈ అల్పపీడనం క్రమంగా తుఫాన్‌గా మారే అవకాశం ఉందని ఈ తుఫాను ఉత్తరాంధ్ర దక్షిణ ఒడిస్సా తీరం దాటుతుందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఒక వాయుగుండం సృష్టించిన విలియం మరవకముందే మరో తుఫాను గండం ముంచుకొస్తున్న క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. అయితే, ప్రజలు అప్రమత్తంగా ఉండే మాట అటుంచితే? తాజా వరదలతో పాఠాలు నేర్చుకోవాల్సింది అధికారులేనని ప్రజలు అంటున్నారు.భవిష్యత్తులో ఇంకెప్పుడూ ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ముఖ్యంగా అధికారులపైనే ఉంది. ప్రభుత్వం ఆదేశాలిచ్చేది ఆయా శాఖల అధికారులు ఇచ్చే నివేదికలను బట్టే కాబట్టి ఇలాంటి పరిస్థితుల్లో అధికారులు ముందే మేల్కొనాల్సిన అవసరం ఉంది. రహదారులు పరిరక్షణ, రవాణా సౌకర్యాలు, చెరువుల పర్యవేక్షణ, నదీ ప్రవాహాల అంచనాల విషయంలో ఎలాంటి అలసత్వం వహించినా అది మరింత నష్టానికి దారితీసే పరిస్థితి ఉంటుందని అర్థం చేసుకోవాలి. గత అనుభావాల సమాచారం ఇప్పుడు లేదని చెప్పుకోడానికి అవకాశం ఉన్నా? ఇప్పటి అనుభావాల ప్రభావం ఎలాంటిదో చెప్పే సమాచారం పుష్కలంగా ఉంది. కనీసం, దీన్ని పరిగణలోకి తీసుకొని, రాబోయే రోజుల్లో ఇలాంటి విపత్తును తట్టుకునే ఏర్పాట్లు చేయాలి. అధికారీ నిబద్ధతతో పనిచేయాలి.

# విఘ్నాలు తొలగించే నాయకుడు వినాయకుడు




ఏ కార్యక్రమం చేపట్టినా తొలి పూజ గణేశుడికే వినాయకుడి పుట్టిన రోజైన 'భాద్రపద శుద్ధ చవితి' రోజునే 'వినాయక చవితి' పండుగను హిందువులు జరుపుకుంటారు. ఆ రోజునే వినాయకుడు పుట్టాడని.. గణాధిపత్యం పొందాడని పలు పురాణ కథలు ప్రచారంలో ఉన్నాయి. వినాయక వ్రతం, పూజా విధానం ఎలా చేయాలో మంథని పట్టణానికి చెందిన పురోహితుడు మత్స్య శివప్రసాద్ తెలిపారు తెలుసుకోండి. వినాయక చవితి రోజున ప్రాతఃకాలమే లేచి ఇంటిని శుభ్రం చేయాలి. తర్వాత తలంటు స్నానం చేసి ఉతికిన వస్త్రాలను ధరించాలి. మామిడాకులు తోరణాలు కట్టి, ఇంటిని అలంకరించారు. ఓ పీటకు పసుపు రాసి ఇంటికి ఈశాన్య భాగంలో లేదా ఉత్తర దిక్కులో ఉంచాలి. ఓ పళ్లెంలో బియ్యంవేసి వాటిపై తమలపాకులు పెట్టుకోవాలి. అగరువత్తులు వెలిగించి, దీపారాధన తర్వాత..'ఓం దేవీంవాచ మజనయంత దేవాస్తాం విశ్వరూపా: పశవో వదంతిసానో మంద్రేష మూర్జం దుహానాధే నుర్వాగాస్మానుప సుష్టుతైత్తు అయం ముహూర్తస్సుముహూర్తోస్తు'శ్లోకం: య శ్శివో నామరూపాభ్యాం యా దేవీ సర్వ మంగళా తయో స్సంస్మరణా త్పుంసాం సర్వతో జయమంగళం అని చదవాలి. పీటపై వినాయక ప్రతిమను ఉంచి, పాలవెల్లికి పసుపు రాసి, కుంకుమతో బొట్టు పెట్టి విగ్రహం తలపై వచ్చేలా దాన్ని వేలాడదీయాలి. దీనిపై పత్రి వేసి నలువైపులా మొక్కజొన్న పొత్తులు, పళ్లతో అలంకరించాలి. ఉండ్రాళ్లు, కుడుములు, పాయసం, గారెలు, పులిహోర, మోదకులు, జిల్లెడుకాయలు మొదలైన పిండివంటలు సిద్ధం చేసుకోవాలి. రాగి లేదా ఇత్తడి పాత్రను తీసుకుని పసుపు రాసి, అందులో నీళ్లువేసి, పైన టెంకాయ, జాకెట్టు ఉంచి కలశం ఏర్పాటు చేయాలి.పూజకు కావాల్సిన సామాగ్రిపసుపు, కుంకుమ, గంధం, అగరవత్తులు, కర్పూరం, తమలపాకులు, పూలు, అరటిపండ్లు, కొబ్బరికాయలు, బెల్లం, తోరం, కుందులు, నెయ్యి, నూనె, వత్తులు, 21 రకాల పత్రి, ఉద్దరిణ, నైవేద్యాలు.పూజా విధానం..ఓం కేశవాయ స్వాహాః, ఓం నారాయణాయ స్వాహాః, ఓం మాధవాయ స్వాహాః అని మూడుసార్లు చేతిలో నీరు వేసుకొని ఆచమనం చేసుకోవాలి. అనంతరంఈ కింది శ్లోకాలను ఉచ్చరించాలి. గోవిందాయ నమః, విష్ణవే నమః, మధుసూదనాయ నమః, త్రివిక్రమాయ నమః, వామనాయ నమః, శ్రీధరాయ నమః, హృషీకేశాయ నమః, పద్మనాభాయ నమః, దామోదరాయ నమః, సంకర్షణాయ నమః, వాసుదేవాయ నమః, ప్రద్యుమ్నాయ నమః, అనిరుద్ధాయ నమః, పురుషోత్తమాయ నమః, అధోక్షజాయ నమః, నారసింహాయ నమః, అచ్యుతాయ నమః, ఉపేంద్రాయ నమః, హరయే నమః, శ్రీ కృష్ణాయ నమః, శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమఃఈ కింది మంత్రాన్ని చెబుతూ కుడి చేతితో అక్షంతలు దేవునిపై చల్లాలి.ఓం శ్రీలక్ష్మీ నారాయణాభ్యాం నమః, ఓం ఉమామహేశ్వరాభ్యాం నమః, ఓం వాణీ హిరణ్యగర్భాభ్యాం నమః, ఓం శచీపురందరాభ్యాం నమః, ఓం అరుంధతీ వశిష్ఠాభ్యాం నమః, ఓం శ్రీ సితారామాభ్యాం నమః, నమస్సర్వేభ్యో మహాజనేభ్యః అయం ముహూర్త స్సుముహూర్తోస్తభూతోచ్చాటనఉత్తిష్టంతు భూతపిశాచాః ఏతే భూమి భారకాః ఏతాషామవిరోధేనబ్రహ్మకర్మ సమారభే అనే మంత్రాన్ని చదువుతూ అక్షతలు తలపై నుంచి వెనుక వేసుకొవాలి.ప్రాణాయామం: ఓం భూః, ఓం భువః, ఓగ్ సువః, ఓం మహః, ఓం జనః, ఓం తపః, ఓగ్ సత్యం, ఓం

### -నీలాపనిందలు పోగొట్టే వినాయక వ్రతకథ

తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్, ఓమా పోజ్యోతీరసోమృతం బ్రహ్మభూర్భువస్సువరోమ్అపవిత్రః పవిత్రోవా సర్వావస్థాంగతోపినా యః స్మరేద్వై విరూపాక్షంస బాహ్యాభ్యంతరశుృచిః అని నాలుగు దిక్కులా ఉద్ధరనితో నీళ్లు చల్లి శుద్ధిచేయాలి. సంకల్పం:మమ ఉపాత్త సమస్త దురితక్షయ ద్వారా శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థం శుభేశోభనే ముహూర్తే, శ్రీ మహావిష్ణోరాజ్ఞాయా ప్రవర్తమానస్య అద్య బ్రాహ్మణ: ద్వితీయపరార్థే, శ్వేతవరాహకల్పే, వైవస్వత మన్వంతరే, కలియుగే, ప్రథమపాదే, జంబూ ద్వీపే, భరతవర్షే, భరతఖండే, మేరోర్థక్షిణదిగ్భాగే, ??.. నదీ సమీపే??? ( శ్రీ శైలస్య) నివాసిత గృహే అస్మిన్ వర్తమాన వ్యావహారిక, చాంద్రమానేన శ్రీ వికారినామ సంవత్సరే, దక్షిణాయనే, వర్ష ఋతౌ, (భాద్రపద) మాసే, (శుక్ల) పక్షే, (చతుర్థ్యాం) తిథి ఇందు వాసరే, శుభ నక్షత్రే, శుభయోగే శుభకరణే, ఏవంగుణ విశేషేణ విశిష్టాయాం, శుభతిథౌ శ్రీమాన్???? గోత్ర: ???.నామధేయ (వారివారి గోత్రం, పేరు చదువుకోవాలి) ధర్మపత్నీ?????? సమేతోహం సకుటుంబస్య క్షేమస్థైర్య విజయ అభయ ఆయురారోగ్య ఐశ్వర్యాభి వృధ్యర్థం, ధర్మార్థ కామ మోక్ష చతుర్విధ ఫల పురుషార్థ సిద్ధ్యర్థం, పుత్రపౌత్రాభివృద్ధ్యర్థం సకలకార్యేషు సర్వదా దిగ్విజయసిద్ధ్యర్థం, శ్రీ వరసిద్ధి వినాయక దేవతా ముద్ధిస్య శ్రీ వరసిద్ధి వినాయక దేవతాపూజాం కరిష్యే అదౌ నిర్విఘ్న పరిసమాప్త్యర్థం శ్రీ మహాగణాధిపతి పూజాం కరిష్యే అంటూ కుడిచేయి ఉంగరం వేలితో నీళ్లు ముట్టుకోవాలి.భవసంచిత పాపౌఘ విధ్వంసన విచక్షణమ్ విఘ్నాంధకార భాస్వంతం విఘ్నరాజ మహంభజేఏకదంతం శూర్పకర్ణం గజవక్త్రం చతుర్భుజం పాశాంకుశధరం దేవమ్ ధ్యాయేత్సిద్ధి వినాయకమ్ ఉత్తమం గణనాథస్య వ్రతం సంపత్కరం శుభం భక్తాభీష్టప్రదం తస్మాత్ ధ్యాయేత్తం విఘ్ననాయకం.షోడశోపచార పూజధ్యాయేత్గజాననం దేవం తప్తకాంచనసన్నిభం, చతుర్భుజం మహాకాయం సర్వాభరణ భూషితం. శ్రీ మహా గణాధిపతయే నమః ధ్యాయామిఅత్రాగచ్ఛ జగద్వంద్య సురరాజార్చితేశ్వర అనాథనాథ సర్వజ్ఞ గౌరీగర్భ సముద్భవ.. ఆవాహయామి:మౌక్తికైః పుష్యరాగైశ్చ నానారత్నైర్విరాజితం రత్నసింహాసనంచారు ప్రీత్యర్థం ప్రతి గృహ్యతాం.. ఆసనం సమర్పయామి:గౌరీపుత్ర నమస్తేస్తు శంకర ప్రియనందన గృహాణార్ఘ్యం మయాదత్తం గంధ పుష్పాక్షతైర్యుతం.. ఆర్ఘ్యం సమర్పయామి:గజవక్త్ర నమస్తేస్తు సర్వాభీష్ట ప్రదాయక భక్త్యాపాద్యం మయాదత్తం గృహాణ ద్విరదానన.. పాద్యం సమర్పయామి:అనాథనాథ సర్వజ్ఞ గీర్వాణ వరపూజిత గృహాణాచమనం దేవ, తుభ్యం దత్తంమయా ప్రభో.. ఆచమనీయం సమర్పయామి: దధిక్షీర సమాయుక్తం థామద్వాజ్యేన సమన్వితం మధుపర్కం గృహాణేదం గజవక్త్రం నమోస్తుతే.. మధుపర్కం సమర్పయామి:స్నానం పంచామృతైర్దేవ గృహాణ గణనాయక అనాథనాథ సర్వజ్ఞ గీర్వాణ గణపూజిత.. పంచామృత స్నానం సమర్పయామి:గంగాదిసర్వతీర్థేభ్యః ఆహృతైరమలిర్జలైః స్నానం కురుష్వభగవానుమాపుత్ర నమోస్తుతే.. శుద్ధోదక స్నానం సమర్పయామి: రక్తవస్త్రద్వయం చారు దేవయోగ్యంచ మంగళం శుభప్రదం గృహాణత్వం లంబోదరహరాత్మజ..వస్త్రయుగ్మం సమర్పయామి:రాజితం బహ్మసూత్రంచ కాంచనం చో త్తరీయకం గృహాణ సర్వదేవజ్ఞ భక్తానామిష్టదాయక.. యజ్ఞోపవీతం సమర్పయామి:చంద నాగరు కర్పూర కస్తూరీ కుంకుమాన్వితం విలేపనం సురశ్రేష్ఠ ప్రీత్యర్థం ప్రతిగృహ్యతాం.. గంధాన్ సమర్పయామి:అక్షతాన్ ధవళాన్ దివ్యాన్ శాలీయాంస్తండులాన్ శుభాన్, గృహాణ పరమానంద ఈశపుత్ర నమోస్తుతే.. అక్షతాన్ సమర్పయామి:సుగంధాని సుపుష్పాణి జాజీకుంద ముఖానిచ ఏక వింశతి పత్రాణి సంగృహాణ నమోస్తుతే.. పుష్పాణి పూజయామి:అథాంగ పూజ.. పుష్పాలతో పూజించాలి.గణేశాయ నమః - పాదౌ పూజయామిఏకదంతాయ నమః - గుల్ఫౌ పూజయామిశూర్పకర్ణాయ నమః - జానునీ పూజయామివిఘ్నరాజాయ నమః - జంఘే పూజయామిఅఖువాహనాయ నమః - ఊరూ పూజయామిహేరంబాయ నమః - కటిం పూజయామిలంబోదరాయ నమః - ఉదరం పూజయామిగణనాథాయ నమః - నాభిం పూజయామిగణేశాయ నమః - హృదయం పూజయామిస్థూలకంఠాయ నమః - కంఠం పూజయామిగజవక్త్రాయ నమః - వక్త్రం పూజయామివిఘ్నహంత్రే నమః - నేత్రం పూజయామిశూర్పకర్ణాయ నమః - కర్ణౌ పూజయామిఫాలచంద్రాయ నమః - లలాటం పూజయామిసర్వేశ్వరాయ నమః - శిరః పూజయామివిఘ్నరాజాయ నమః - సర్వాణ్యంగాని పూజయామిఏకవింశతి పత్రపూజఏకవింశతి పత్రపూజ: 21 రకాల పత్రాలతో పూజించాలి. సుముఖాయనమః - మాచీపత్రం పూజయామి,గణాధిపాయ నమః - బృహతీపత్రం పూజయామి?ఉమాపుత్రాయ నమః - బిల్వపత్రం పూజయామి,గజాననాయ నమః - దుర్వాయుగ్మం పూజయామిహరసూనవేనమః - దత్తూరపత్రం పూజయామి,లంబోదరాయనమః - బదరీపత్రం పూజయామి,గుహాగ్రజాయనమః - అపామార్గపత్రం పూజయామి,గజకర్ణాయనమః - తులసీపత్రం పూజయామి,ఏకదంతాయ నమః - చూతపత్రం పూజయామి,వికటాయ నమః - కరవీరపత్రం పూజయామి,భిన్నదంతాయ నమః - విష్ణుక్రాంతపత్రం పూజయామి,వటవేనమః - దాడిమీపత్రం పూజయామి,సర్వేశ్వరాయనమః - దేవదారుపత్రం పూజయామి,ఫాలచంద్రాయ నమః - మరువకపత్రం పూజయామి,హేరంబాయనమః - సింధువారపత్రం పూజయామిశూర్పకర్ణాయనమః - జాజీపత్రం పూజయామి,సురాగ్రజాయనమః - గండకీపత్రం పూజయామి,ఇభవక్త్రాయనమః - శమీపత్రం పూజయామి,వినాయకాయ నమః - అశ్వత్థపత్రం పూజయామి,సురసేవితాయ నమః - అర్జునపత్రం పూజయామి,కపిలాయ నమః - అర్కపత్రం పూజయామి,శ్రీ గణేశ్వరాయనమః - ఏకవింశతి పత్రాణి పూజయామి.అష్టోత్తర శతనామ పూజావళిఓం గజాననాయ నమఃఓం గణాధ్యక్షాయ నమఃఓం విఘ్నరాజాయ నమఃఓం వినాయకాయ నమఃఓం ద్వైమాతురాయ నమఃఓం?

## సుజీత్‌కుమార్‌ను పార్టీ నుంచి బహిష్కరించిన బీజేడీ.. ఎంపీ పదవికి రాజీనామా




న్యూఢిల్లీ: ప్రముఖ న్యాయవాది, ఎంపీ సుజీత్ కుమార్ పై బిజూ జనతాదళ్ పార్టీ బహిష్కరణ వేటు వేసింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డాడన్న కారణంతో బీజేడీ ఆయనను పార్టీ నుంచి బహిష్కరించింది. ఎంపీ సుజీత్ కుమార్‌ను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నామని, ఈ బహిష్కరణ తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొంటూ బీజేడీ ఒక ప్రకటన విడుదల చేసింది.బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ పేరుతో ఆ ప్రకటన విడుదలైంది. దాంతో సుజీత్‌కుమార్ వెంటనే తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. సుజీత్ కుమార్ రాజీనామా లేఖను భారత ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌కఢ్ ఆమోదించారు.

## ఉద్యోగులకు మట్టి గణపతుల పంపిణీ

కరీంనగర్,కరీంనగర్ కలెక్టరేట్లో సిబ్బందికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మట్టితో తయారుచేసిన గణేష్ విగ్రహాలను పంపిణీ చేశారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణానికి హాని చేయని మట్టి విగ్రహాలను పూజించాలని కోరారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ తో తయారుచేసిన విగ్రహాలు నీటిలో కరగకపోవడం వల్ల నీటి కాలుష్యం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా రెవెన్యూ అధికారి పవన్ కుమార్, మెప్మా పీడీ స్వరూపారాణి పాల్గొన్నారు.

## సెబీ చీఫ్ మాధవి పురి బుచ్, ఆమె భర్త పేరిట ముంబై కంపెనీలో వాటాలు

న్యూఢిల్లీ: సెబీ ఛైర్‌పర్సన్‌పై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సెబీ చీఫ్ మాధవి పురి బుచ్‌పై రోజుకో వివాదం వెలుగులోకి వస్తుంటే తాజాగా కాంగ్రెస్ నేత పవన్ ఖేరా సంచలన ఆరోపణలు చేశారు. మాధవి పురి బుచ్, ఆమె భర్త పేరిట ముంబైలో కరోల్ ఇన్ఫో సర్వీసెస్ లిమిటెడ్ పేరున ఓ కంపెనీ ఉందని అన్నారు. వాకార్డ్‌లో ఈ కంపెనీ అంతర్భాగమని, ఈ కంపెనీకి అదే ప్రమోటర్లు ఉన్నారని ఆరోపించారు. వాకార్డ్ కంపెనీపై సెబీ నిరంతరం ఆదేశాలు ఇస్తోందని, దాని కేసులను పర్యవేక్షిస్తోందని చెప్పారు.వాకార్డ్‌పై ఫిర్యాదులను పరిశీలిస్తున్న సెబీ ఛైర్‌పర్సన్ కూడా మాధవి పురి బుచ్ అని గుర్తుచేశారు. దీనిపై ఇన్‌సైడర్ ట్రేడింగ్ కేసు కూడా ఉందని, వాకార్డ్ ఇన్‌సైడర్ ట్రేడింగ్ కేసును కూడా మాధవి సంస్థ (సెబీ) పర్యవేక్షిస్తోందని చెప్పారు. ఇది పరస్పర ప్రయోజనాల సంఘర్షణ కిందకు వస్తుందని, ఇది అవినీతేనని తాను పేర్కొంటానని ఆరోపించారు. ఇది పూర్తిగా అవినీతి కేసేనని ఆయన వ్యాఖ్యానించారు. కాగా, పవన్ ఖేరా ఇటీవల సెబీ చీఫ్ మాధవి పురి బుచ్‌పై పలు ఆరోపణలు గుప్పించారు.సెబీ ఛైర్‌పర్సన్‌గా ఉంటూ ఆమె లాభదాయక పదవిలో ఉన్నారని వెల్లడించారు. ప్రైవేట్ బ్యాంక్ ఐసీఐసీఐ బ్యాంక్, దాని అసెట్ మేనేజ్‌మెంట్ విభాగం ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ నుంచి నిరంతర ఆదాయం పొందుతున్నారని పవన్ ఖేరా ఆరోపించారు. ఈ కంపెనీల్లో వేతనం తీసుకుంటూ ఆపై క్యాపిటల్ మార్కెట్స్ నియంత్రణ సంస్థ సెబీ హోల్‌టైమ్ మెంబర్‌గా ఉంటూనే, ఛైర్‌పర్సన్ అయ్యారని తెలిపారు. మాధవి బుచ్ 2017 నుంచి 2024 మధ్య ఐసీఐసీఐ బ్యాంక్, ఐసీఐసీఐ ప్రుడెంట్ నుంచి వేతనంగా ఏకంగా రూ. 16.80 కోట్లు పొందారని చెప్పారు.



# ఆపరేషన్ ఉద్దానం షురూ

శ్రీకాకుళం, సెప్టెంబర్ 6, ఉద్దానంలో మూత్రపిండాల వ్యాధికి అడ్డుకట్ట వేసేందుకు కూటమి ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఈ వ్యాధి మూలాలను గుర్తించేందుకు మరో సారి అంతర్జాతీయ స్థాయి పరిశోధకులకు బాధ్యతలు అప్పగించింది. కొలంబియా విశ్వవిద్యాలయానికి చెందిన పర్యావరణ ఆచార్యులు లెక్స్ వానీన్ పలాస కిడ్నీ ఆసుపత్రికి చేరుకుని ఆధ్యాయానికి అడుగులు వేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పుండకర్, పలాస ఎమ్మెల్యే గౌతు శిరిష ఈ పరిశోధకుడుతో సమావేశమయ్యారు. ఆయన నిర్వహించాల్సిన పరిశోధనలపై చర్చించారు.ఉద్దాన ప్రాంతంలో నీరు, మట్టి, ఇంట్లో మారుమూల ప్రాంతాల్లో ఉన్న ధూళి, వినియోగిస్తున్న పురుగుమందులు వంటి వాటిపై లోతైన అధ్యయనం చేసేందుకు గాను స్థానిక సిబ్బందికి రెండు రోజులు పాటు శిక్షణ ఇచ్చారు. నీరు, మట్టి, దూళి తదితర వాటిని పరీక్షించేందుకు గాను దాదాపు కోటి రూపాయలు విలువ చేసే అవసరమైన పరికరాలు, కంటైనర్లను జీన్ కొలంబియా నుంచి తీసుకొచ్చారు. కేవలం తాగునీటిపైనే 15 రకాల పరీక్షలు నిర్వహించేందుకు తగినచర్యలు చేపడుతున్నారు. కొన్ని పరీక్షలు ఆయన తీసుకువచ్చిన యంత్రాలద్వార పరీక్షించాల్సి ఉండగా మరికొన్నింటిని వేరే చోట పరీక్షలు నిర్వాహించాల్సి వుందన్నారు. ఈ మేరకు కలెక్టర్ మరింత విశ్లేషాత్మకంగాచర్చించారు.కిడ్నీ వ్యాధి ప్రబలడానికి మూలాలను అధ్యయం చేయాలనేది కూటమి ప్రభుత్వ లక్ష్యంగా చెబుతున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హాయాంలో జనసేనాని పవన్ కళ్యాణ్ ఉద్దానం ప్రాంతంలో పర్యటించినఅనంతరం ఆ ప్రాంతంలో కిడ్నీ బాధితులను ఆదుకునే ప్రక్రియకు ఉపక్రమించారు. ఈ మహమ్మారి ప్రబలడానికిగల కారణాలపై అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రనాయుడు వైద్య బృందాన్ని నియమించి అధ్యయానికి తగు ఆదేశాలుజారీ చేసిన వైద్య నిపుణులు మూలాలను గుర్తించలేకపోయారు. మూలాలను గుర్తించలేనప్పటికి తాగునీరు ప్రధాన కారణంగా అను మానించడంతో శుద్ధ జలాలుఅందించేందుకు టీడీపీ ప్రభుత్వం హాయాంలో బీజం పడింది. వైసీపీ ప్రభుత్వ హాయాంలో బాధితులను పెన్షన్ పెంపకం, పలాసలో ఆసుపత్రి నిర్మాణం, శుద్ధ జలాలు అందించేందుకు తదితర చర్యలకు సీఎం జగన్మోహన్ రెడ్డి చొరవ తీసుకున్నారు.పలాస ఎమ్మెల్యే గౌతు శిరిష అసెంబ్లీ సమావేశాల సమయంలో మరల ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. పలాసలో కిడ్నీ ఆసుపత్రి నిర్మాణంచేసి వదిలేశారే తప్ప కిడ్నిబాధితులు, ఉద్దానప్రాంతవాసులు ఆశించిన ఫలితం అందలేదని వారి ముందుంచారు. కిడ్నీ వ్యాధి తీవ్రతపట్ల వారికి అవగాహన ఉండడంతో మరల క్షేత్ర స్థాయిలో కిడ్ని మూలలను గుర్తించేందుకు పరిశోధనలకు ఉపక్ర మించారు. ఈ నేపథ్యంలో కిడ్నీ ప్రభావిత గ్రామాల్లో ది గ్లో బల్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో పరిశోధనలు నుంచి క్షేత్ర స్థాయిలో ప్రారంభమయ్యాయి. మొత్తం 5 రోజులు పాటు ఉద్దానంలోని కవిటి, వజ్రపుకొత్తూరు, మందస, పలాస, కంచిలి, సోంపేట, ఇచ్చాపురం మండలాలోని కిడ్ని ప్రభావిత ప్రాంతాల్లో పరిశోధనలు నిర్విహించి కిడ్ని బాధితుల ఇళ్ల వద్ద మట్టి, ధూళీ సేకరించి గ్రామాల్లో తాగునీరు, పంటపొలాల్లో ఎరువుల వినియోగం తదితర అంశాలపై పర్యావరణ ఆచార్యులు లెక్స్ వాన్ జీన్ ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు శిక్షణ పొందిన జిల్లాలోని ఆ ప్రాంతానికి చెందిన వైద్య బృందం సేకరించనుంది. బుధవారం క్షేత్ర స్థాయిలో పర్యటించి బాధితులతో ముఖాముఖి అయ్యారు. వారు ఎదుర్కోంటున్న సమస్యలు తదితర అంశాలపై జీన్ సేకరించి నమోదు చేసుకున్నారు. అమెరికానుంచి తీసుకువచ్చిన పరీక్ష కిట్లలో మట్టి, నీరు, దూళీని భద్ర పరుస్తున్నారు. గ్లోబల్ ఇనిస్ట్యూట్ వైద్యాధికారి డాక్టర్ బాలాజీ పలాస మండలం నుంచి పరీక్షలు నిర్వహించడం ప్రారంభించామన్నారు. 120 శ్యాంపిల్స్ సేకరించనున్నామన్నారు. కాగా రంగోయి ప్రాంతంలో నమూనాలు సేకరించిన వారిలో డాకరట్ దీలీప్, ఫీల్డ్ సూపర్ వైజర్ ఎంవీ సత్యనారాయణ ఉన్నారు.ఉద్దానంలో కిడ్నీ మహామ్మారి ప్రబలడానికి గల కారణాలపై అధ్యాయనం చేసి శోధించడమే ప్రభుత్వ ఆశయమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఇటివలే ఈ సమస్యపై సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి తీసుకెళ్లడంతో మరో సారి పరీక్షలకు ప్రభుత్వం చొరవ తీసుకుందన్నారు. చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్నప్పుడు 2014-2019 మధ్యలో కిడ్నీ బాధితులను ఆదుకోవడానికి తాగునీరు అందివ్వడానికి యుద్ధ ప్రాతిపదికన అప్పట్లో చర్యలకు ఉపక్రమించామన్నారు. అనంతరం పట్టించుకోలేదని మరల కూటమి ప్రభుత్వ హాయాంలో సీఎం, డిప్యూటీ సీఎంలో దృష్టి సారించారన్నారు. నార్త్ అమెరికా, సౌత్ అమెరికాలో పరిశోధనలు జరిపారని ఆసంస్థ మరల ఈ ప్రాంతంలో అధ్యాయనం చేస్తుందన్నారు. శుద్ధ జలాలతో కొంత వరకు ఈ వ్యాధిని అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ను ఆమె కోరారు. ఆఫ్ షోర్ ప్రాజెక్టు నుంచి పలాస పట్టణానికితాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రతిపాదన ఉన్నప్పటికి ముందస్తుగా జలజీవన్ మిషన్ ద్వారా శుద్ధజలాలు అందివ్వాలని ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన అనుకూలంగా స్పందించి ఆర్ డబ్ల్యుఎస్ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో ఆర్డీవో భరత్, ఆర్డబ్ల్యుఎస్ అధికారులు, వైద్యులు పాల్గోన్నారు.

# కర్ణాటక నెయ్యి, సిక్కోలు జీడిపప్పు....

## తిరుమల లడ్డూలు భలే...భలే



తిరుమల, సెప్టెంబర్ 6, తిరుమల శ్రీవారి లడ్డు అంటే చాలా మందికి మక్కువ. పరమపవిత్రంగా భావించే భక్తు లడ్డూలు ఎక్కువ తీసుకురమ్మని తిరుమల వెళ్లే భక్తులకు చెబుతుంటారు. రానురాను దిన్నో స్టేటస్ సింబల్గా కూడా మార్చేశారు. ఈ గిరాకీని అడ్డం పెట్టుకున్న దళారీలు తిరుమల లడ్డుతో వ్యాపారం చేయడం మొదలు పెట్టారు.కొండపై తిష్టవేసి ఫేక్ ఐడీలు, ఫేస్ మనుషులతో తిరుమల లడ్డూలను కొనుగోలు చేసి అడ్డగోలుగా అమ్ముకుంటున్నారు. ఇలాంటి వాటిని అరికట్టి స్వచ్ఛమైన తిరుమల లడ్డూలను భక్తులు అందించేందుకు టీటీడీ చర్యలు తీసుకుంది. స్వామి వారి లడ్డూలు కావాలంటే దళారులను నమ్మి అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారని టీటీడీ అధికారులు గుర్తించారు. దీనిని నియంత్రించేందుకు టీటీడీ కొత్త విధానాలు తీసుకొస్తుంది.తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు లడ్డూలు కావాలంటే భక్తులకు టీటీడీ ఒక ఉచిత లడ్డూ, రూ.50 లడ్డూ అదనంగా అందిస్తుంది. ఇక అధికంగా కావాలంచే మాత్రం లడ్డూల నిల్వ బట్టి అందిస్తున్నారు. ఇక బయట వ్యక్తులు లడ్డూలు కొనాలంటే మాత్రం ఆధార్ కార్డు కు రెండు లడ్డూలు అందిస్తామని ప్రకటించారు. దీని ద్వారా తిరుమలకు రాలేని భక్తులు లడ్డూలు కావాలంటే దళారులను ఆశ్రయిస్తున్నారని టీటీడీ గుర్తించింది. తిరుమలలో లడ్డూలు అధికంగా పొందుతున్న వారిపై కూడా దృష్టి పెట్టింది. మరోవైపు టీటీడీలో పని చేస్తున్న వివిధ శాఖల ఉద్యోగులు కూడా ఎన్ని లడ్డూలు పొందారని ఎక్కువ లడ్డూలు పొందిన వారిపై దృష్టి సారించారు. ఇప్పటికే పలువురి బ్యాంకు స్టేట్ మెంట్లు తీసుకురావాలని విజిలెన్స్ అధికారులు తెలిపారుతిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కావాలనే భక్తులు దళారులను ఆశ్రయించకుండా ఉండేందుకు టీటీడీ స్థానికాలయాలతో పాటు సమాచార కేంద్రాల్లో లడ్డూల విక్రయాలు ప్రారంభమైంది. టీటీడీ స్థానికాలయాలైన తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం, తిరుపతి లోని శ్రీ కోదండరామ స్వామి ఆలయం, శ్రీ గోవిందరాజస్వామి ఆలయం, శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయం, అప్పలయాగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి ఆలయం, ఒంటిమిట్ట లోని శ్రీ కోదండరామ స్వామి ఆలయం, దేవుని కడప, హైదరాబాద్ లోని హిమాయత్ నగర్, జుబ్లిహిల్స్, అమరావతి, విజయవాడ, రాజమండ్రి, పిఠాపురం, విశాఖపట్నం, రంపచోడవరం, చెన్నైలోని శ్రీవారి ఆలయాల్లో లడ్డూలు విక్రయాలు జరుగుతున్నాయి. బెంగళూరు, వేలూరు లోని టీటీడీ సమాచార కేంద్రాల్లో మొత్తం ఈనెల 2వ తేదీ 50 వేల లడ్డూలు, 3వ తేదీ 13 వేలు, 4వ తేదీ 9500 లడ్డూలు విక్రయాలు జరిగాయని టీటీడీ ఈవో శ్యామల రావు తెలిపారు. లడ్డూ ప్రసాదాలు కావాల్సిన భక్తులు అక్కడ కూడా లడ్డూలను పొందవచ్చు.శ్రీవారి భక్తులకు మరింత రుచికరమైన లడ్డూ ప్రసాదాలు అందించేందుకు నాణ్యమైన ఆవు నెయ్యిని టీటీడీ కొనుగోలు చేసింది. బెంగుళూరుకు చెందిన కర్ణాటక కోపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ (ఐఓఈ) నుండి కొనుగోలు చేసిన నెయ్యి లారీ తిరుపతి నుండి తిరుమలకు పూజ చేసి బుధవారం తరలించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నియమించిన అధికారులు లడ్డూ నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టారు. నాణ్యమైన నెయ్యి లేకపోవడం వల్ల లడ్డూ రుచి తగ్గిందని గుర్తించారు. గతంలో నెయ్యి సరఫరాదారులు నాణ్యత, రుచి, వాసన లేని ఆవు నెయ్యి సరఫరా చేసినట్లు నిర్ధారణ చేసుకున్నారు. టీటీడీలో నెయ్యి నాణ్యత పరిశీలించేందుకు సరైన ల్యాబరెటరీ లేదు, ప్రయివేటు ల్యాబరెటరీ సౌకర్యం ఉన్న పరిశీలించలేదు. టీటీడీలో నూతనంగా అత్యాధునిక ల్యాబరెటరీ ఏర్పాటు చేస్తునట్లు, అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో తెలిపారు. ఇందులోని సిబందికి మైసూర్ లో శిక్షణ ఇస్తున్నారు. నాణ్యమైన నెయ్యి కొనుగోలుకు సంబంధించి నలుగురు ప్రముఖ డైరీ నిపుణులతో కమిటీ ఏర్పాటు చేశారు. ఇందులో ఎన్ డిఆర్ఏ విశ్రాంత ఆచార్యులు డా.సురేంద్రనాథ్, హైదరాబాద్కు చెందిన డా.విజయ భాస్కర్ రెడ్డి, ప్రొ.స్వర్ణ లత, బెంగుళూరుకు చెందిన డా.మహదేవన్ ఉన్నారు. ఈ కమిటీ నాణ్యమైన నెయ్యి కోసం టెండర్ లో ఎలాంటి అంశాలు చేర్చాలని దిశ నిర్ధేశం చేసింది. కమిటీ సూచనలతో గతంలో నెయ్యి సరఫరా చేస్తున్న ఐదుగురు సరఫరాదారులలో ఒకరు అందించిన నెయ్యి నాణ్యత ప్రమాణాలు సరిపోలడం లేదని, కల్తీ నెయ్యిని సరఫరా చేస్తున్నట్లు పరీక్షల్లో నిర్ధారణ అయ్యింది. నెయ్యి నాణ్యత, రుచిని మెరుగుపరచడానికి టెండర్ షరతులను సవరించారు. కొత్త టెండర్ షరతు ప్రకారం, డెయిరీలు నెయ్యిలో ఉడకబెట్టడానికి ముందు కొన్ని గంటలపాటు ఎంపిక చేసిన స్టార్టర్ కల్చర్తో వెన్నని పక్వానికి తీసుకురావాలి. ఇంకా డెయిరీలు కావాల్సిన రుచిని పొందడానికి వెన్నను 120 డిగ్రీలు సెంటిగ్రేడ్ లో 2 -5 నిమిషాలు వేడి చేయాలి. కర్ణాటక కో అపరేటివ్ మిల్క్ ప్రొడెక్ట్ (నందిని నెయ్యి) ని ఆమోదించి, నేరుగా కంపెనీ నుంచి నెయ్యిని కొనుగోలు చేస్తున్నారు. దీని ద్వారా రుచికరమైన లడ్డూలు భక్తులు అందించేందుకు టీటీడీ చర్యలు తీసుకుంది.

## కుదుట పడుతున్న ముంపు గ్రామాలు

విజయవాడ,గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలు దెబ్బకు అతలాకుతలమైన తెలుగు రాష్ట్రాలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. వర్ష బీభత్సానికి, రాష్ట్రంలో పలు ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. ముంపు ప్రాంతాలలో వారం రోజులుగా కరెంటు సౌకర్యం కూడా లేక తీవ్ర ఇబ్బందులు పడ్డామని బాధితులు చెబుతున్నారు. గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది దీంతో రెండు రోజుల క్రితం వరద తగ్గినప్పటికీ వర్ధధాటికి విద్యుత్ స్తంభాలు, రోడ్లు కొట్టుకుపోవడం తో గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

దీంతో అధికారులు సహాయక చర్యలు ముమ్మరం చేయటంతో ప్రజలు కొంచెం ఇబ్బందులు తీరుతాయి అనుకుంటున్నారు కానీ పెనుగంచిప్రోలు మండలం ముచ్చింతల గ్రామానికి నేటికీ వారం రోజులు గడుస్తున్నప్పటికీ గ్రామంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో గ్రామ ప్రజలకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. గురువారం రాత్రి 11 గంటల అయినప్పటికీ విద్యుత్ సరఫరా లేకపోవడంతో విషయాన్ని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్యా) దృష్టికి పెనుగంచిప్రోలు మండల అధ్యక్షులు చింతల సీతారామయ్య తీసుకువెళ్ళడంతో హటాహుటిన విద్యుత్ అధికారులు వెంటపెట్టుకొని గ్రామానికి వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో సుమారు 40 కిలోమీటర్ల చుట్టూ తిరిగి ముచ్చింతాల గ్రామం చేరుకొని సుమారు మూడు గంటలు గ్రామంలోని విద్యుత్ అధికారులతో దగ్గర ఉండి మరమ్మతు లు చేపించి గ్రామంలో విద్యుత్ సరఫరా చేయించి గ్రామం నుంచి ఇంటికి తిరిగి వెళ్లారు దీంతో గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకి ధన్యవాదాలు తెలిపారు

# ఉచిత మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ

### పాల్గొన్న నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్

నంద్యాల ,నంద్యాల స్థానిక పార్క్ రోడ్డు లో గల బాల అకాడమీ మరియు రవీంద్ర విద్యాసంస్థలు అధినేత రవీంద్ర , మాధవిలత ఆధ్వర్యంలో స్థానిక ఆత్మకూరు బస్టాండ్ దగ్గర ఉచిత మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ హాజరై వినాయక విగ్రహాలను పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ వినాయక చవితి పండుగ సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు కాకుండా మట్టి విగ్రహాలు వాడి మన పర్యావరణాన్ని మనమే పరిరక్షించుకోవాలని ముఖ్య ఉద్దేశంతో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు . మత సామరస్యానికి ప్రతీకగా వినాయక చవితి నిర్వహించుకుంటారని ప్రతి ఒక్కరూ వినాయక చవితి రోజు వినాయకుని పూజిస్తారని కావున దయచేసి అందరూ మట్టి వినాయకుని విగ్రహాలనే వాడాలని తెలియజేశారు . ఈ కార్యక్రమంలో ఒకటవ పట్టణ సిఐ సుధాకర్ రెడ్డి , 6 వ వార్డు టిడిపి ఇన్చార్జి పల్లె వెంకటసుబ్బయ్య , మిద్దె చిన్న ఉసేని , బింగుమల్లె శ్యాంసుందర్ గుప్తా , గోవిందు తదితరులు పాల్గొన్నారు.

# నిత్యావసర సరుకుల పంపిణీని ప్రారంభించిన మంత్రులు

విజయవాడ, విజయవాడ బీ.ఆర్.టీ.ఎస్ రోడ్డు నుంచి నిత్యావసర సరుకుల పంపిణీ ని రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ శుక్రవారం ప్రారంభించారు. వరద ముంపు ప్రాంతాల్లో బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ చేసారు.

- ప్రతి ఇంటికి నిత్యావసర సరుకుల పంపిణీ నూరు శాతం జరిగే విధంగా ఆదేశాలు ఇచ్చారు. 25 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, కేజీ పంచదార, 2 కేజీల ఉల్లిపాయలు, 2 కేజీల బంగాళదుంపలు, లీటరు పామాయిల్ సరుకులతో ముంపు ప్రాంతాలకు వాహనాలు బయలుదేరాయి.

# ఫైట్స్ పీక్ కు చేరిందా

కాకినాడ, సెప్టెంబర్ 6 పిఠాపురంలో వంద రోజుల్లోనే రాజకీయాల్లో పెనుమార్పులు సంభవించాయి. జనసేన, టీడీపీ క్యాడర్ మధ్య నువ్వా? నేనా అన్నట్లుంది వ్యవహారం. ఒకరకంగా టీడీపీని జనసేన స్థానిక నేతలు దూరం పెడుతుంటే, ఇటు టీడీపీ నేతలు కూడా జనసేన లోకల్ లీడర్స్ ను ఇప్పటికే బాయ్ కాట్ చేశారు. అధికారంలోకి కూటమి వచ్చి వంద రోజులు కాకముందే పిఠాపరంలో టీడీపీ, జనసేన ఫైట్ పీక్స్ కు చేరింది. అధినాయకత్వం మాత్రం బాగానే ఉన్నప్పటికీ నియోజకవర్గంలో మాత్రం నేతలు రెండు చీలిపోయారు. మాజీ ఎమ్మెల్యే వర్మను జనసైనికులు దూరం పెడుతుండగగా, ఇందుకు టీడీపీ శ్రేణులు భగ్గుమంటున్నాయి. రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, జనసేన అధినేత పవన్ కల్యాణ్ జోడి సజావుగానే ఉంది. ఇద్దరూ సమన్వయంతో పనిచేసుకుంటూ వెళుతున్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయినా పవన్ కల్యాణ్ కు పూర్తి స్థాయిలో బాధ్యతలను అప్పగిస్తున్నారు. ఆయనను దూరం చేసుకునే ఏ చిన్న పనిని కూడా చంద్రబాబు చేయడం లేదు. అన్నింటా పవన్ కల్యాణ్ కు చంద్రబాబు ప్రాధాన్యత ఇస్తున్నారు. పవన్ కల్యాణ్ కూడా అదేస్థాయిలో చంద్రబాబుకు గౌరవం ఇస్తున్నారు. ఆయన మీద వైసీపీ విమర్శలు చేసినా జనసేనాని ఊరుకోవడం లేదు. ఇద్దరు అగ్రనేతలు ఆ స్థాయిలో ఉంటే పిఠాపురంలో మాత్రం పరిస్థితి మాత్రం తేడాగా ఉంది. పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎం కావడంతో ఎక్కువగా ఆయన విజయవాడలోనే ఉంటున్నారు. దీంతో పిఠాపురం నియోజకవర్గంలో సమస్యలను మాజీ ఎమ్మెల్యేగా వర్మ పట్టించుకుంటున్నారు. మరి పవన్ కల్యాణ్ ఆయనకు ఆ బాధ్యతలు అప్పగించారే ఏమో? తెలియదు కాని.. అధికారుల వద్దకు వెళ్లడం కాని, పనులు చేయడం వంటివి మాజీ ఎమ్మెల్యే వర్మ చూసుకుంటున్నారు. గతంలో తాను ఎమ్మెల్యే కావడంతో తనకు పరిచయమున్న అధికారులతో పనులు చేయిస్తున్నారు. అయితే దీనిని జనసైనికులు అడ్డుపడుతున్నారు. ఎమ్మెల్యే తమ పార్టీకి చెందిన వారని, టీడీపీ నేతల మాటలు ఎలా వింటారంటూ అధికారులపై వత్తిడి తెస్తున్నారు. దీంతో అధికారులు కూడా నిస్సహాయ స్థితిలో ఉన్నారు.మరోవైపు జనసేన పిఠాపురంలో నిర్వహించే కార్యక్రమాలకు, చివరకు ప్రభుత్వ కార్యక్రమాలకు కూడా వర్మను పిలవకపోవడంతో ఆయన అనుచరుల్లో ఆగ్రహం వ్యక్తమవుతుంది. పొత్తులో భాగంగా తనసీటును త్యాగం చేసిన వర్మకు ఇలాంటి గౌరవిమిస్తారా? అంటూ నేరుగా మండిపడుతున్నారు. వర్మ కూడా జనసేన నేతలపై అసహనం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. అసలు ఎన్నికల సమయం నుంచే కొంత గ్యాప్ ఉంది. అది అధికారంలోకి రాగానే మరింత పెరిగింది. ఇప్పుడు ఇంకా రెండు పార్టీల క్యాడర్ దూరమయినట్లే కనిపిస్తున్నాయి. పిఠాపురం విషయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ జోక్యం చేసుకుంటే తప్ప ఈ సమస్యకు చెక్ పడే అవకాశం లేదు.

# పక్కాగా బుక్ చేస్తున్న టీడీపీ

విజయవాడ, సెప్టెంబర్ 6,తెలుగుదేశం పార్టీ నేతలు ఐదేళ్లలో అనుభవించిన కేసులు, అరెస్టులు, కష్టాలను గుర్తుకు తెచ్చుకుంటే.. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేసింది దాదాపు సున్నా అనుకోవచ్చు. వైసీపీకి చెందిన సోషల్ మీడియా కార్యకర్తల్లో చాలా మంది ఇప్పటికీ అసభ్యంగా , ఫోటోలు మార్ఫింగ్ చేస్తూ సోషల్ మీడియాలో ధైర్యంగా పోస్టులు పెడుతూనే ఉన్నారు. ఏ ఒక్కరిపైనైనా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఎవరినైనా అరెస్టు చేసినా నోటీసులు ఇచ్చి వదిలేస్తున్నారు. ఈ కారణంగా టీడీపీ సోషల్ మీడియా టీముల్లో అసంతృప్తి కనిపిస్తోంది. కానీ అలా చేయడానికి .. ఆ నేతల్ని.. సోషల్ మీడియా కార్యకర్తల్ని ప్లాన్డ్ గా బుక్ చేయడానికేనన్న సంకేతాలు వస్తున్నాయి. దానికి తాజా సాక్ష్యం.. దాడుల కేసుల్లో వైసీపీ నేతలకు అరెస్టు కావడం మినహా మరో మార్గం లేకపోవడం.మాజీ ఎంపీ నందిగం సురేష్ ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. మరో కీలక నేత, ఎమ్మెల్సీ అప్పిరెడ్డిని అరెస్టు చేశారు. ఆచూకీ తెలిస్తే దేవినేని అవినాష్, జోగి రమేష్ వంటి మరో పది మంది కీలక నేతల్ని అరెస్టు చేస్తారు. సజ్జల రామకృష్ణారెడ్డికీ అరెస్టు భయం ఉందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే పలు విచారణలను సైలెంట్ గా పూర్తి చేస్తున్నారు. వైసీపీ హయాంలో అంతా బహిరంగంగానే అవినీతి చేశారని టీడీపీ నేతలు ఆరోపిస్తూ ఉంటారు. చర్యలు తీసుకోవడంలో ఎందుకు ఆలస్యమని కూడా ప్రశ్నిస్తున్నారు. కానీ ఇప్పుడు వారికి క్లారిటీ వస్తోంది.టీడీపీ కార్యాలయం, చంద్రబాబు ఇంటిపై దాడి కేసుల్లో ప్రభుత్వం మారగానే కదలిక వచ్చింది. పోలీసులు సీసీ ఫుటేజీ , కాల్ రికార్డులు బయటకు తీసి కీలక వ్యక్తుల్ని నిందితులుగా మార్చారు. అయితే వైసీపీ హయాంలో జరిగినట్లుగా అర్థరాత్రి అరెస్టులు చేయలేదు. వారికి న్యాయపరమైన అన్ని అవకాశాలను కల్పించారు. ముందస్తు బెయిల్ కోసం.. అరెస్టు నుంచి రక్షణ కోసం ప్రయత్నించి విఫలమైన తర్?తనే రంగంలోకి దిగారు. అంటే ఇప్పుడు వారు అరెస్టు నుంచి డిఫెండ్ చేసుకోవడానికి తప్పుడు కేసులు అని వాదించడానికి అవకాశం లేదు. అంతే కాదు కక్ష సాధింపు అని కూడా చెప్పలేరు. ఎందుకంటే.. చట్ట ప్రకారమే అన్నీ చేశారు కానీ ఎక్కడా గీత దాటలేదని స్పష్టమవుతోంది. ఇలాంటి పరిస్థితి వస్తే వారికి జైలుకు వెళ్లడం తప్ప మరో మార్గం లేదు. ఇప్పుడు కక్షసాధింపులన్న విమర్శలు రావు.. దాడులకు పాల్పడిన వారిని జైలుకు పంపినట్లవుతుంది. వైసీపీ నేతలపై ఇప్పటికే పలు ఫిర్యాదులు వచ్చాయి. పలు అంశాల్లో సీఐడీ విచారణ కూడా జరుపుతోంది. మద్యం, ఇసుక స్కాముల్లో పెద్ద తలకాయలే ఉంటాయన్న ప్రచారం జరుగుతోంది. ఇలాంటి వారిని కూడా కక్ష పూరితంగా జైలుకు పంపాలన్న లక్ష్యంతో కాకుండా.. చట్టబద్ధంగా అన్ని అవకాశాలు కల్పించి.. ఇక దారి లేని పరిస్థితుల్లో అరెస్టు కావడం తప్ప మరో ఆప్షన్ లేదన్న స్థితికి తీసుకు వచ్చి అరెస్టు చేయాలనుకుంటున్నారు. అప్పటికీ వారిపై పెట్టిన కేసుల్లో ప్రజల్లో చర్చ జరుగుతుందని వారికీ నిజాలు తెలుస్తాయని.. భావిస్తున్నారు. చట్ట ప్రకారం వ్యవస్థ నడుస్తోందని ప్రజలకు నమ్మకం కలిగించడం ముఖ్య మని.. ఆ దిశగానే చర్యలు ఉంటాయని మొదటి నుంచి చెబుతున్నారు. ఇప్పుడు అదే జరుగుతోంది. వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తల్ని కూడా.. గీత దాటుతున్నా.. అరెస్టులు చేసి నోటీసులు ఇచ్చి వదిలేస్తున్నారు. వారు ఆ తప్పుల్ని పదేపదేచేస్తే.. కోలుకోలేని దెబ్బను చట్టపరంగా కొట్టడానికే అవకాశాలు కల్పిస్తున్నారని..ఈ వ్యూహాన్ని వారు ఊహించలేకపోతున్నారని భావిస్తున్నారు. మొత్తంగా రాజకీయాల్లో ఆవేశం..ఈగోలు ముఖ్యం కాదన ఆలోచనతోనే ప్రత్యర్థుల్ని దెబ్బకొట్టాలన్న వ్యూహాన్ని టీడీపీ పాటిస్తోంది.

# స్మార్ట్ సిటీ నంద్యాల ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలు పంపిణి....

## ఉచితంగా వెయ్యి మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

నంద్యాల ప్రతినిధి సెప్టెంబర్ 06 విభారె న్యూస్ :- నంద్యాల సూరజ్ గ్రాండ్ హోటల్ దగ్గర స్మార్ట్ సిటీ నంద్యాల ఆధ్వర్యంలో వెయ్యి మట్టి విగ్రహాలు పంపిణి చేసారు. కిచెన్ గార్డెన్ అధినేత గంగిశెట్టి దీపక్ కుమార్ సహకారంతో పంపిణీ చేయడం జరిగిందని చేయడం జరిగింది స్మార్ట్ సిటీ నంద్యాల సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి విజయ్ కుమార్ ,నంద్యాల టీడీపీ జిల్లా కార్యదర్శి ఔఓఆ ఫిరోజ్ ,రామకృష్ణ కాలేజీ అధినేత రామకృష్ణ సార్, నంద్యాల ప్రముఖ న్యాయవాది తులసి రెడ్డి, ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్త, టూ టౌన్ సీఐ ఇస్మాయిల్ , ఎల్ల స్వామి పాల్గొని ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా




టిడిపి యువ నాయకులు ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ పిఓపి తో తయారుచేసిన విగ్రహాలలో వాడే రసాయనాలు రంగులు పర్యావరణానికి హాని కలిగిస్తాయని కావున ప్రతి ఒక్కరూ మట్టితో తయారుచేసిన వినాయక విగ్రహాలను ప్రతిష్టించి పూజించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్మార్ట్ సిటీ నంద్యాల సభ్యులు మనోజ్, షహేన్షా, రాజ,సాయి కుమార్, బ్లడ్ సద్దాం, సోహైల్,ఖాజా, రవి జాక్సన్,నవీన్,సన, మున్నా పాల్గొన్నారు.





## శ్రీశైలంలోబంగారు పూలు విరాళం





నవ్యాంధ్ర జర్నలిస్ట్ న్యూస్ శ్రీశైలం నంద్యాల జిల్లా శ్రీశైలంలో ఈ రోజు శుక్రవారం శ్రీ బి.సి. శివకుమార్, కర్నూలు వారు దేవస్థానమునకు 108 బంగారు పూలను విరాళంగా సమర్పించారు. ఈ బంగారు పూల మొత్తం బరువు 19 గ్రాములు. అమ్మవారిఆలయప్రాంగణములోని ఆశీర్వచనమండపంలో దాతలు వీటిని సీనియర్ వేదపండితులు గంటి రాధకృష్ణ, పర్యవేక్షకులు కె. అయ్యన్న, అమ్మవారి ఆలయం ఇన్స్పెక్టరు కె. మల్లికార్జున, సంబంధిత గుమాస్తా ఎం. సావిత్రిలకు అందజేశారు. అనంతరం వీరికి తగు రశీదు మరియు వేదాశీర్వచనముతో శ్రీస్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలను, ప్రసాదాలు అందజేయబడ్డాయి

# 93 పరిశ్రమల యూనిట్లకు 8.43 కోట్ల సబ్సిడీ మంజూరు

**పరిశ్రమల అభివృద్ధికి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి :జిల్లా పరిశ్రమల ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి.**



నంద్యాల :జిల్లాలో ఉపాధి అవకాశాలు కల్పించే నూతన పరిశ్రమల స్థాపన కోసం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి పరిశ్రమల అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పరిశ్రమల ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. జిల్లా పరిశ్రమల మేనేజర్ శ్రీనివాస యాదవ్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్ర కుమార్, ఎస్సీ ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ ప్రెసిడెంట్ రాజమహేంద్రనాథ్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోమశేఖర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు×ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు సృష్టించే పారిశ్రామిక రంగ అభివృద్ధికి సంబంధిత అధికారులు సమిష్టిగా కృషి చేయాలని ఆదేశించారు. పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి నూతన పరిశ్రమలను నెలకొల్పి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అనుబంధ శాఖలు సమన్వయంతో పనిచేసి జిల్లా ఆర్థిక ప్రగతికి తోడ్పాటు అందించాలన్నారు. ఇందులో భాగంగానే జిల్లాలో 93 పరిశ్రమల యూనిట్లకు 8.43 కోట్ల రూపాయల సబ్సిడీ మొత్తాన్ని మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పరిశ్రమలు స్థాపించే ఎంటర్ప్రీనర్స్ కు సంబంధించి పెండింగులో వున్న 8 యూనిట్లను పరిశీలించి మంజూరు కోసం ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్, స్టాండ్ అప్ ఇండియా కింద నిర్దేశించిన 66 యూనిట్ల లక్ష్యం మేర యూనిట్ల నెలకొల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇందుకు సంబంధించి బ్యాంకులకు పంపిన 119 దరఖాస్తులలో 21 యూనిట్లు మంజూరు చేసినట్లు లీడ్ డిస్టిక్ మేనేజర్ జిల్లా కలెక్టర్ నివేదించగా అందరినీ సమన్వయం చేసుకొని నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎమ్ఎస్ఎమ్ఈ యూనిట్ల స్థాపన కొరకు స్వీకరించిన దరఖాస్తులను నిర్దేశిత గడువు లోపు పరిష్కరించే విధంగా బ్యాంక్ అధికారులకి ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఎగుమతులకు సంబంధించి సంస్థ లేకపోవడం వల్ల జిల్లా రెవెన్యూ అంతా కృష్ణపట్నం పోర్టుకు వెళుతుందని ఈ ప్రాంతంలో సంబంధిత సంస్థ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ×ఎస్సీ, ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజామహేంద్రనాథ్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో ఎస్సీ, ఎస్టీల కొరకు ప్రత్యేక ఎమ్ఎస్ఎమ్ఈ పార్కు ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ను కోరారు. అర్బన్ డెవలప్మెంట్ చార్జెస్ (ల్యాండ్ కన్వర్షన్, రెవెన్యూ) లో ఎస్సీ, ఎస్టీ ఎంటర్ప్రెన్యూర్ లకు వంద శాతం రియంబర్స్మెంట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీ, ఎస్టీ ఎంటర్ప్రెన్యూర్ లకు సంబంధించి నూతన పరిశ్రమల ఏర్పాటులో విద్యుత్ ఇన్స్టాలేషన్ చార్జెస్ (ట్రాన్స్ఫార్మర్స్) భారంగా ఉన్నాయని వాటి తొలగింపుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరారు. ఎంఎస్ఎంఈ రంగంలో రుణాల మంజూరు కొరకు ప్రత్యేకమైన దినాన్ని కేటాయించవలసిందిగా కమిటీ సభ్యులు కలెక్టర్ ను కోరారు. ఈ సమావేశంలో ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ అధ్యక్షుడు రామలింగారెడ్డి, భూగర్భ జల శాఖ డిడి రఘురాం, ఆర్టీవో శివారెడ్డి, డిపిఓ మంజులవాణి తదితర అధికారులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధికి వెంగయ్య స్వీట్స్ వారి విరాళం



నవ్యాంధ్ర జర్నలిస్ట్ , న్యూస్. ఆత్మకూరు పట్టణానికి చెందిన వెంగయ్య స్వీట్స్ షాప్ వారు తమవంతుగా విజయవాడ వరద బాదితుల సహాయార్థం భారీ విరాళాన్ని అందజేశారు. శుక్రవారం ఉదయం వేల్పనూరు నందు గౌరవ శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ని కలిసి రూ. 25,101.00/ – విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేశారు. ఈ సందర్భంగా విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముందుకు వచ్చిన వెంగయ్య స్వీట్స్ షాప్ వారిని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అభినందించారు.

## బిజెపి కేంద్ర మంత్రులతో కేశవరెడ్డి విద్యాసంస్థల అధినేత కేశవరెడ్డి

నవ్యంధ్ర జర్నలిస్ట్ నంద్యాల జిల్లా న్యూన్ తేదీ :06-09-2024,కేశవరెడ్డి విద్యాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు యన్. కేశవరెడ్డి విద్యారంగంలో సాధించిన విజయాల స్ఫూర్తితో ప్రజలకు తన వంతు సేవలందించే ఉద్దేశంలో భాగంగా ఇటీవలే కేంద్ర మంత్రి పురందేశ్వరి సమక్షంలో బిజెపి లో చేరి క్రియాశీల రాజకీయాలలో పాల్గొంటున్న నేపథ్యంలో నిన్నటి రోజున కేంద్ర మంత్రులైన కిషన్ రెడ్డి, బండి సంజయ లను పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రివర్యులు కిషన్ రెడ్డి మాట్లాడుతూ కేశవరెడ్డి బిజెపిలో చేరడం ఒక మంచి నిర్ణయమని అభినందించారు. మున్ముందు అన్ని విషయాలలో తమ మద్దతు వారికి ఉంటుందని తెలిపారు. బిజెపి తో కలిసి నడవాలన్న కేశవరెడ్డి ఆలోచనను అభినందిస్తూ, పార్టీలో మంచి భవిష్యత్తు వారికి ఉంటుందని ఏ విషయంలో నైనా పార్టీ అండగా నిలబడుతుందని కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు. ఆ తర్వాత భవిష్యత్తు కార్యాచరణ పై ఇరువురు అరగంటకు పైగా ఇష్టాగోష్టిగా చర్చించడం జరిగింది.



## నందమూరి మోక్షజ్ఞ 30వ జన్మదినం సందర్భంగా వరదబాదితులకు నిత్యావసర వస్తువుల కిట్లు జిల్లా అధ్యక్షులు పి. తిక్కారెడ్డి గారికి అందజేసిన నందమూరి అభిమానులు.




కర్నూలు టిడిపి వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు మనుమడు నందమూరి బాలక్రిష్ణగారి ముద్దుల తనయుడు నందమూరి మోక్షజ్ఞ 30 జన్మదిన సందర్భమును పురస్కంరించుకోని నందమూరి మోక్షజ్ఞ ఆర్గనైజేషన్ కర్నూలు వారి ఆధ్వర్యంలో, వరదల కారణంగా విజయవాడ లో నిరాశ్రయులైన వారి సహాయార్థము ఈ రోజు నందమూరి మోక్షజ్ఞ ఆర్గనైజేషన్ సభ్యులు ఆర్య శంకర్, మోతిలాల్, రమేష్ రెడ్డి ప్రతాప్, వెంకటేష్, నాగసూరి, సర్దార్ మొదలగు వారు నిత్యావసర వస్తువుల కిట్లను కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి గారికి జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో అందజేయడం జరిగినది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పి. తిక్కారెడ్డి మాట్లాడుతూ విజయువాడ నగరం మొత్తం కూడా జలమయమైతే, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రేయింబవళ్లు శ్రమించి ప్రజలను కాపాడటం, వారికి కావలసిన నిత్యావసరాలను డ్రోన్లు, హెలిక్యాప్టర్ల ద్వారా చేరవేసి ప్రజలకు అందజేయడం జరిగిందనీ, ఈ రోజు నందమూరి అనిమానులు మోక్షజ్ఞ పుట్టిన సందర్భంగా ఎలాంటి ఆడంబరాలకు పోకుండా వారు ఖర్చుచేయదలుచున్న మొత్తమును వరద బాదితుల సహాయార్థము నిత్యావసర వస్తువులను అందజేయడం వారి సహృదయాన్ని అబినందిస్తున్నామనీ, క్లిష్టపరిస్థితులను ఎదుర్కొనుచున్న ప్రజలకు అండగా నిలిచినందుకు అభినందనలు తెలియజేశారు. జిల్లా నుండి వరద బాదితులకు వీలైనంత మేరకు జిల్లాలోని తెలుగుదేశంపార్టీ నాయకుల తోడ్పాటుతో సహాయాన్ని అందజేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఆలూరు ఇన్చార్జి బి. వీరభద్రగౌడ్, వై. నాగేశ్వరరావుయాదవ్, కె. నాగేంద్ర, రెడ్డిపోగు బజారన్న, కె. మహేష్ గౌడ్,పి. సాయిబాబ సత్రం రామక్రిష్ణుడు,

## కర్నూలు జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

**జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కే బాబురావు**



కర్నూలు జిల్లా సోదర సోదరీ మణులకు కాంగ్రెస్ నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు శ్రేయోభిలాషులకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కే బాబురావు గారు వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. హిందువులకు ముఖ్యమైన పండుగల్లో వినాయక చవితి పెద్ద పండుగని కావున హిందూ సోదరులు కుటుంబ సభ్యులతో ఈ పండుగను ఆనందంగా జరుపుకొని గణనాధుని కృపకు పాత్రులు కాగలరని తొమ్మిది రోజులు జరిగే నవరాత్రి ఉత్సవాలలో కుల, మత, పెద్ద, చిన్న అనే తారతమ్యం లేకుండా అందరూ కలిసి ప్రతి వీధిలో వినాయకుని విగ్రహాలు ప్రతిష్ఠించి పూజలు చేసుకోవడం సాంస్కృతిక కార్యక్రమాలతో చాలా ఆనందంగా జరుపుకోవడం ఈ పండుగ ప్రత్యేకత అని అధికారులు చొరవ తీసుకొని వినాయకుల విగ్రహాల వద్ద పరిశుభ్రమైన వాతావరణం కల్పించగలరని బాబురావు గారు కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను కోరారు.

## బి. తాండ్రపాడు నుండి గార్గేయపురం వరకు జరుగుతున్న రింగ్ రోడ్డు పనులను నవంబర్ 15 వ తేది నాటికి పూర్తి చేయండిజిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు : బి. తాండ్రపాడు నుండి గార్గేయపురం వరకు జరుగుతున్న రింగ్ రోడ్డు పనులను నవంబర్ 15 వ తేది నాటికి పూర్తి చేయాలని ఎన్ హెచ్ 340సి పిడి ని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టు ల పై నేషనల్ హైవే అధికారులతో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్ హెచ్ 340 బి కి సంబంధించి సోమయాజులపల్లె నుండి డోన్ రూట్ కి సంబంధించిన భూసేకరణ పనులు త్వరితగతిన చేయాలని కర్నూలు ఆర్డీఓ ను కలెక్టర్ ఆదేశించారు. ఎన్ హెచ్ 167 కి సంబంధించి ఆదోని బైపాస్ కొరకు భూసేకరణ పనులు త్వరితగతిన చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ ను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా. బి. నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ ట్రైని కలెక్టర్ చల్లా కళ్యాణి, ఇన్చార్జి డిఆర్ఓ చిరంజీవి, కర్నూలు ఆర్డీఓ శేషి



రెడ్డి , ఇంచార్జ్ మున్సిపల్ కమిషనర్ రామలింగేశ్వర, ఎన్ హెచ్ 340సి పిడి పద్మ, ఎన్ హెచ్ 40 పిడి అశోక్ కుమార్, ఎన్ హెచ్ 150సి పిడి తరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**